ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫ్రైడే–డ్రైడే

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నవ యువ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చెత్త లేకుండా శుభ్రం చేయించి, తడి–పొడి చెత్తను వేసుకోవడానికి డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. అనంతరం దోమల నివారణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్వ కుమార స్వామి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో అనేక మంది ఆసుపత్రుల చుట్టూ తిరిగుతున్నారని అన్నారు. దోమల నివారణ కోసం ప్రతి ఒక్కరూ మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలక్రిష్ణ, జీహెచ్ఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటునందించాలి



నార్సింగిలో గాయత్రి బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న అశోక్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో గాయత్రి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు 47వ శాఖను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కౌన్సిలర్ ఉషారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులు ప్రజలకు అవసరమైన ఆర్థిక సహాయాలను చేస్తేనే వాటిని ఆదరిస్తారన్నారు. బ్యాంకు అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో ప్రారంభించిన గాయత్రి బ్యాంకు తనదైన శైలిలో కృషి చేస్తూ మల్టీ స్టేట్ బ్యాంకుగా అభివృద్ధి చెంది 2856.94కోట్ల వ్యాపారాన్ని సాధించి 47 బ్రాంచ్‌లకు ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ శ్రీనివాస్, రీజినల్ మేనేజర్ వనిత, పాలకవర్గ సభ్యులు సౌజన్య, రాజిరెడ్డి, సత్యం, అశోక్, గండిపేట సబ్‌రిజిస్ట్రార్ మహేందర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ.. సన్మానం



శంషాబాద్: శంషాబాద్ తహసీల్దార్ శుక్రవారం రవీందర్ దత్తు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్ఐలు సంజీవ, సాగరిక, సీనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించి స్వాగతం పలికారు.

సన్మానం..

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రవీందర్ దత్తును సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు మైలారం సులోచన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

పౌరసరఫరా సహాయాధికారిగా పుల్లయ్య

శంషాబాద్: సరూర్ సర్కిల్–3 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా పుల్లయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పుల్లయ్యను రాజేంద్రనగర్ సర్కిల్ రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమైన ఉత్తమ సేవలందించేందుకు డీలర్లు కృషి చేయాలని సూచించారు. రేషన్‌డీలర్లు సమయపాలన పాటించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా కార్డుదారులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జావిద్, డీలర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, శివకుమార్, జహీర్, శ్రీరాములు, నయీం, జాఫర్ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: అరుణోదయ కాలనీ, 60 గజాలు, ఇందిరమ్మ కాలనీలలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూల కుండీలలో నిలువ ఉన్న నీటిని తొలగించారు. నీరునిలిచిన గుంతలలో లార్వీసైడ్ (టీమిపాస్) స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. కిస్మత్‌పూర్‌లోని బ్రిడ్జి వద్ద నీటిలో ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకరి సురేష్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు జగన్, యాదగిరి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో..

బైరాగిగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ శరత్‌చంద్ర పాల్గొని విద్యార్థినులకు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలని, నిలువ ఉన్న నీటిని తొలగించాలని పలు సూచనలు చేశారు. మైనార్టీ పాఠశాలలో ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వనిత, టీచర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత డాక్టర్ పై దౌర్జన్యం

మణికొండ: మున్సిపాలిటీ కేంద్రం లక్ష్మీనగర్‌లోని ప్రమీల అపార్ట్‌మెంట్‌లో మౌలాలికి చెందిన డాక్టర్ ప్రశాంతి మూడు అంతస్తులు 5 సంవత్సరాలు అద్దెకు తీసుకుని సేవియర్ కేర్ ఆసుపత్రి, కీర్తన టెలివిజన్ సంస్థలను నిర్వహిస్తుంది. గత రెండు నెలలుగా భవనాన్ని ఖాళీ చేయాలని, యజమాని ఉదయభాస్కర్‌రెడ్డి, అతని భార్య ప్రమీలను ఇబ్బంది పెట్టారని ప్రశాంతి తెలిపారు. ఆసుపత్రిని తమకు ఇచ్చేయాలని, తామే నడుపుకుంటామని ఒత్తిడి తెచ్చారని బాధితురాలు మీడియాతో పేర్కొన్నారు. తాను మాజీ పోలీసు అధికారినని బెదిరించటంతో పాటు దౌర్జన్యంగా కార్యాలయంలోని ఫర్నిచర్, హాస్పటల్ మిషనరీని ధ్వంసం చేశారన్నారు. తనపై చేస్తున్న వేధింపులను భరించలేక ఈనెల 4న రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఇబ్బందులు పెడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే అతనిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. తన ఆసుపత్రిని తిరిగి తెరిపించి తన సిబ్బందికి జీవనోపాధి కల్పించాలని ఆమె కోరారు.

తిరుపతి విమానం రద్దు.. ప్రయాణికుల ఆగ్రహం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం రద్దు కావడంతో ప్రయాణికులు ఆందోళన చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సాయంత్రం 6.45 గంటలకు వెళ్లాల్సిన విమానం రాత్రి 10.30 గంటల వరకు కూడా వె వెళ్లకపోవడంతో ప్రయాణికులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విమానం రద్దుకు సంబంధించిన విషయాలను ఎయిర్‌లైన్స్ సిబ్బంది స్పష్టం చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూర్ వెళ్లాల్సిన మరో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూడా మూడు గంటలకు పైగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

బోధన- భోజన వసతులపై..

రోడ్డెక్కి విద్యార్థినుల ఆందోళనలు

- న్యాయం కావాలంటూ విద్యార్థినుల ఆందోళన
- పాల్మాకుల వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనలు
- కేజీబీవీ విద్యార్థినులు, డీఈఓ, పోలీసుల హామీతో ఆందోళన విరమణ
- వారంలోపు పరిష్కరించాలంటూ డిమాండ్
- పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామంటూ హెచ్చరికలు



కస్తూర్బా పాఠశాల ఆవరణలో సమస్యలను వివరిస్తున్న విద్యార్థినులు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో గత కొంత కాలంగా మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదు. దీనికి తోడు ఉపాధ్యాయులు బోధన కూడా సరిగా చేయడంలేదని ఆరోపిస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. పదో తరగతికి చెందిన సుమారు 50 మంది పాఠశాల నుంచి బెంగళూరు జాతీయ రహదారి వరకు రెండు కి.మీటర్లు నడుచుకుంటూ వెళ్లి రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న సీఐ నరేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. చివరకు వారిని రోడ్డు పక్కన ఉన్న బస్టాప్‌లో కూర్చోబెట్టి సమస్యలను తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న డీఈఓ సుశీందర్‌రావు అక్కడకు చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పి పాఠశాలకు తీసుకెళ్లారు.

సమస్యల ఏకరవు..

పాఠశాల ఆవరణలో సీఐ నరేందర్‌రెడ్డి, డీసీఓ సుజాతతో విద్యార్థినులు సమస్యలను ఏకరవు పెట్టారు. సరిగా భోజనం పెట్టడంలేదని ఆరోపించారు. కొంత మంది ఉపాధ్యాయులు బోధనా తీరు సరిగా లేదన్నారు. ఆయా సబ్జెక్టులను తెలుగులోనే బోధిస్తుంటే మేము ఆంగ్లం ఎలా నేర్చుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి సైతం బోరు నీళ్లు అందజేస్తున్నారని తెలిపారు. మూడేళ్ల కిందట ఐడీ కార్డు, టై కోసం అందరి వద్ద డబ్బులు వసూలు చేసి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. కుళ్లిన పండ్లు ఇస్తున్నారని, దాతలు ఇచ్చిన ఉపకరణాలను వినియోగించకుండా స్టోర్‌రూంలో పడేశారని ఆరోపించారు.

పరీక్ష పేపర్లు మేమే కరెక్షన్ చేయాలి

పరీక్ష పేపర్లు, నోట్ పుస్తకాలను మేమే కరెక్షన్ చేయాలి. ఇలా అయితే మేము ఎలా చదువుకునేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష సమయంలో తప్పని పరిస్థితుల్లో కాపీ కొట్టాల్సి వస్తుందని, ఈ సమయంలో ఉపాధ్యాయులు పర్యవేక్షించకుండా వేరే చోటకు వెళ్లి కూర్చుంటారని పేర్కొన్నారు. తెలుగు టీచరు పోస్టు ఖాళీగా ఉందన్నారు. సమస్యల పై ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ఫిర్యాదు చేస్తే.. వారిపై తర్వాత ఉపాధ్యాయులు వేధిస్తున్నారని తెలిపారు. పరీక్షల్లో మార్కులు తక్కువ వేస్తున్నారని పేర్కొన్నారు.

నరుకులు పక్కదారి..

విద్యార్థుల ఆందోళన తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని పాఠశాలలో ఉపాధ్యాయులు పనితీరుపై మండిపడ్డారు. సిలిండర్‌తో పాటు సరకులను బయటకు తీసుకెళ్లి విద్యార్థుల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాలకు వస్తే చదువులు ఎలా చెబుతారని ప్రశ్నించారు. వారంలోగా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పగా.. ఆ లోపు పరిష్కారం కాకుంటే ఆందోళన ఇంతకంటే రెట్టింపు ఉంటుందని విద్యార్థినులు హెచ్చరించారు.

సొమ్మసిల్లిన విద్యార్థినులు..

పాఠశాల నుంచి రహదారి వరకు నడుచుకుంటూ వెళ్లిన విద్యార్థినులు అలసిపోయారు. మధ్యాహ్నం భోజనం చేయకుండా వీరంతా రోడ్డుపైకి చేరుకోవడంతో, ఈ సమయంలో వారి వెంట వచ్చిన 8వ తరగతి విద్యార్థిని కావ్య, పదో తరగతి విద్యార్థిని పావని సొమ్మసిల్లి రోడ్డుపై పడిపోయారు. దీంతో వెంటనే వారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చర్యలు తీసుకుంటాం..

విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటామని డీఈఓ సుశీందర్‌రావు తెలిపారు. మెనూ పాటించడంలేదని, బోధన సరిగా లేదని విద్యార్థినులు చెబుతున్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

– డీఈఓ సుశీందర్‌రావు

నేటి నుంచి వెండి కొండ జాతర

- 69వ జాతరకు సిద్దుల గుట్ట ఆలయం సిద్ధం
- శనివారం మొదలై సోమవారం ముగియనున్న జాతర
- బసవేశ్వరాలయం నుంచి ఊరేగింపుతో ప్రారంభం



శంషాబాద్: వెండి కొండ సిద్దేశ్వరాలయం (సిద్దులగుట్ట) జాతకు ముస్తాబైంది. శంషాబాద్ పట్టణంలోని పాలరాతి కొండపై కొలువుదీరిన జంగమయ్యకు ఏటా శ్రావణమాసం చివరి మూడురోజుల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. 69 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ జాతరకు ఈ ఏడు కూడా సర్వం సిద్ధమైంది.

ఊరిగింపుతో మొదలై..

రుద్రాభిషేకం అనంతరం పట్టణంలోని బసవేశ్వరాలయంలో ఈ నెల 31 శనివారం సాయంత్రం ఊరేగింపు మొదలవుతుంది. పట్టణ ప్రజలు పల్లకిలో వైభవంగా స్వామివారిని ఊరేగించి సిద్దుల గుట్ట ఆలయానికి తీసుకెళ్తారు. రాత్రి 8 గంటల తర్వాత గణపతి, ఆంజనేయస్వామి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామి వారి రుద్రాభిషేకం, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, వీరభద్రేశ్వరస్వామి అభిషేకం, అన్నప్రసాదం, రాత్రికి పార్వతిపరమేశ్వరుల కల్యాణం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం అగ్నిగుండములు, మహాన్యాసరుద్రాభిషేకం, మహాబిల్వార్చన, వీరభద్రేశ్వరస్వామి అభిషేకం, కుంకుమార్చన, అన్నదానం, ఆశీర్వచనంతో జాతర ముగుస్తుంది.

వేలాదిగా భక్తుల రాక..

శంషాబాద్ చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు విచ్చేస్తారు. పట్టణంలోని జాతీయ రహదారి బస్టాండ్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో సిద్దుల గుట్ట దేవాలయం ఉంటుంది. ఆటోలు, ఇతర వాహనాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తుంది.

ఏర్పాట్లు..

జాతర కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ పాలకమండలితో పాటు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, మంచి నీటి వసతి సంబంధిత పనులు పూర్తి పర్యవేక్షిస్తారు.

సర్వే నెం 156/1లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- టీఎన్జీవోస్ కాలనీలో అక్రమ ఇళ్లను కూల్చివేసిన జీహెచ్ఎంసీ అధికారులు
- మూడు ఇళ్లను, రెండు బేస్‌మెంట్‌ల నేలమట్టం
- కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవంటూ హెచ్చరికలు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలోని సర్వే నెంబర్ 156/1లో జీహెచ్ఎంసీకి 3000 గజాల స్థలాన్ని కేటాయించింది. అందులో కొందరు కబ్జాదారులు రూములు వేసుకొని కబ్జా చేస్తున్నారని సమాచారం అందడంతో శుక్రవారం జీహెచ్ఎంసీ సిబ్బందితో మూడు ఇళ్లను, రెండు బేస్‌మెంట్‌లను కూల్చివేశారు. అనంతరం కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీకి కేటాయించిన స్థలాల జోలికివస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గతంలో ఈ సర్వే నెంబర్‌లలో అనేక మార్లు భూ కబ్జాదారులు ఇళ్లను నిర్మించుకున్నారని, అప్పటి ఎమ్మార్వో చంద్రశేఖర్ పలుమార్లు ఆ నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందన్నారు. మళ్లీ కొందరు నాయకులు ఆ స్థలంలో వారికి ఎలాంటి పత్రాలు లేకుండానే పక్కా ఇళ్లను నిర్మించుకున్నారని, వాటిని కూల్చి వేశామన్నారు. ఈ స్థలంలో ఎవరైన ఇళ్లను నిర్మించుకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానికులను హెచ్చరించారు.

సవాళ్లను పరిష్కరించే నైపుణ్యాలను పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శుక్రవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్ట్‌సెట్ టాలెంట్ అక్విజిషన్ (ఇండియా, ఫిలిప్పీన్స్) వైస్ ప్రెసిడెంట్, మైక్రాన్ సెంట్రల్ ఇంజనీరింగ్ ఆసియా హెడ్ డైరెక్టర్ శరత్ హాజరయ్యారు. ఇంజనీరింగ్ కోర్సులు సృజనాత్మకంగా, వినూత్నంగా కేరీర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని, వారు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సవాళ్లను పరిష్కరించే వినూత్న నైపుణ్యాలను పెంచుకోవాలని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్, టెలికమ్యూనికేషన్ (ఇరిసెట్) డీన్ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ఎగ్జామినేషన్స్ విభాగం ప్రొఫెసర్ అంకమ్మరావు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ వెంకటరమణ, ఓరియంటేషన్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ హరిలీలలు వారి విభాగాల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శనివారం రాజేంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫోర్ట్‌వీవ్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఫోర్ట్‌వీవల్ కాలనీ, పర్మార్రెడ్డి హిల్స్, హ్యాపీ హోమ్స్ కాలనీ, అశోక్ విహార్, జనచైతన్య–2 పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువులోని శ్రీ తుల్జా భవానీ రేణుక ఎల్లమ్మ ఆలయం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. నూతన కార్యవర్గ చైర్మన్‌గా పీసరి వినయ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బనావాత్ రామాఉలునాయక్, కార్యదర్శిగా కందాడ బాబు రావు, సహాయ కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా రామ్‌రెడ్డి, రాచగాల్‌రెడ్డిలు నియమితులైయ్యారు. కార్యవర్గ సభ్యులు నిస్వార్థ సేవతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పరుస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. పాత కార్యవర్గ సభ్యులు కటారే రామ్‌నరేష్, చరాయి రమేష్‌గౌడ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



డ్రస్ మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్న మహిళలు



అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన బట్టలు, గృహోపకరణ వస్తువులు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూవలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు అమ్మకాలు జరుపుతున్నారు. అనేక రాష్ట్రాలలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలు దారులు ఆదరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అక్బర్ కోరారు.

పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు

- పాఠశాలలో వసతులపై విద్యార్థులతో ఆరా తీసిన జిల్లా కలెక్టర్ శశాంక
- 2023–24లో ఉత్తీర్ణత 100 శాతానికి పెంచాలి
- పిల్లల ఎదుగుదలకు చర్యలు చేపట్టాలంటూ ఆదేశాలు



ప్లే గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

రాజేంద్రనగర్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాలలోని వసతులు, ఉపాధ్యాయుల బోధన విధానం, భోజన వసతులు, పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పోషక ఆహారంపై 7వ తరగతి, 8వ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించి మిడ్ డే మిల్ వర్కర్స్ పని విధానాన్ని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, త్రాగునీరు, సంపు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రెరీ వంటి సదుపాయాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం 70 శాతం నమోదు కాగా.. ఈ విద్యా సంవత్సరంలో 100/100 శాతం ఉత్తీర్ణత అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించి సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో భోజనశాల, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, ప్లే గ్రౌండ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన వసతుల కోసం ఆర్థికంగా సహాయం చేయడానికి ముందుంటామని తెలిపారు. దీని కోసం ప్రిన్సిపాల్, ఏఈ ఆధ్వర్యంలో తగిన రిపోర్టు తయారు చేసి డీఈఓకు అందజేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి సుసిందర్ రావు, ఎంఈవో శంకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో తనిఖీ

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కిస్మత్‌పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం పాఠశాలను జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థినీలకు అందించే భోజనాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ నేపథ్యంలో వారికి అందుతున్న వసతులు, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీల ఎదుగుదలకు అవసరమైన పౌష్టిక ఆహారం, మెడికల్ సదుపాయాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా సిబ్బంది, ఏఎన్ఎం, హెడ్‌కుక్, అడిషనల్ కుక్‌ల పని విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్‌రావ్, ఎంఈవో శంకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

అర్ధరాత్రి గుడిసెలోంచి ఏడాది బాలుడి అదృశం



అదృశ్యమైన బాలుడు

శంషాబాద్: అర్ధరాత్రి తల్లిదండ్రులతో పాటు నిద్రపోయిన ఓ ఏడాది బాలుడు అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూలీలైన తల్లిదండ్రులు మురళి, స్వాతీలు పట్టణంలోని హుడా కాలనీలోని గుడిసెలో నివాసముంటున్నారు. గురువారం అర్ధరాత్రి నిద్రలో ఉన్న వారి ఏడాది కుమారుడు ఈశ్వర్ తల్లిదండ్రులు లేచి చూసే సరికి లేకపోవడంతో అన్ని చోట్లా వెతికారు. అయినా ఆచూకి లభించక పోవడంతో శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విస్తృతంగా గాలిస్తున్నట్లు సీఐ బాలరాజు తెలిపారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



నీటి నిలువలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మణికొండ: ఫ్రైడే–డ్రైడేలో భాగంగా 18వ వార్డు పుప్పాలగూడలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ నివాసాల సమీపంలో ఎక్కడా నీటి నిలువలు లేకుండా చూసుకుని దోమల వ్యాప్తిని అరికట్టాలని అన్నారు. ప్రజలకు దోమల వ్యాప్తితో వస్తున్న రోగాలు, వాటి వ్యాప్తి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించి పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, మెడికల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలతో అదృశ్యమైన గృహిణి



అదృశ్యమైన తల్లి, ముగ్గురు పిల్లలు

అత్తాపూర్: భర్తతో గొడవపడి తన ముగ్గురు పిల్లలతో సహా కనిపించకుండాపోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్కాపూర్ నందగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన లలితాదేవి, రవీంద్ర సహాని భార్యాభర్తలు శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. రవీంద్ర సహాని మార్బుల్ బండలు వేసి పనులుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాలతో 19న వీరిద్దరూ గొడవపడిన నేపథ్యంలో 20వ తేది ఉదయం ఏడు గంటలకు మార్బుల్ బండలు వేసే పనిలో భాగంగా రవీంద్ర ఇంటి నుంచి పనికి వెళ్లాడు. అది గమనించిన భార్య లలితాదేవి తన ఇద్దరి కూతుర్లతో పాటు కుమారుని కూడా వెంట తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు బంధువులను, స్నేహితులను విచారించగా, ఆచూకి తెలియకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం



అంజుమ్

అత్తాపూర్: కూరగాయలు తెచ్చిన కూతురు చిల్లర డబ్బులు మరిచిపోయాను తీసుకు వస్తాను అని చెప్పి వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నందగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అసన్‌నగర్ ప్రాంతానికి చెందిన రిజ్వానాబేగం ఫిరోజ్‌ఖాన్‌ల కూతురు అంజుమ్(20) గురువారం 11 గంటలకు కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చింది. రావాల్సిన డబ్బులు తీసుకురావడం మరిచిపోయాను తీసుకుని వస్తాను అని చెప్పి వెళ్లిన కూతురు కనిపించకుండాపోయింది. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.